క్లుప్తంగా

అన్నాబావుసాఠేను ఆదర్శంగా తీసుకోవాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇచ్చోడ: అన్నాబావుసాఠేను యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నాబావుసాఠే సంఘం అధ్యక్షుడు జన్నరపు సాహెబ్‌రావు అన్నారు. శుక్రవారం అన్నాభావుసాఠే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితజాతి అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లోక శిరీష్‌రెడ్డి, దుబాక సుభాష్, కాశిపాక విష్ణు, కల్లెపెల్లి రాజు, జెల్ల నర్సయ్య, రేణిగుంట సురేశ్, కొల్లూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గోరింటాకు సంబురాలు



గోరింటాకు పెట్టుకున్న విద్యార్థినులు

నేరడగొండ: మండలంలోని బుగ్గరాం(బి) ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం గోరింటాకు సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాథోడ్ సునీతతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు గోరింటాకు పెట్టుకున్నారు. ఆడపడుచులంతా ఒక్కచోట చేరి సంబరంగా గోరింటాకు నూరి చేతులనిండా పెట్టుకుంటూ కబుర్లు చెబుతూ తెగ సందడి చేస్తారు. కాళ్లు, చేతులు, గోళ్లు శుభ్రపడతాయని, రోగ నిరోధకంగా పనిచేయడంతో అంటువ్యాధులను కూడా దూరం చేస్తుందని వైద్యులు సైతం చెబుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని ఏఈ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఖానాపూర్, సొనార్‌గల్లీ, కోలిపుర, అంబేద్కర్‌నగర్ కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిచి ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తపాలా శాఖలో 2.0 నూతన సాంకేతికత

నార్నూర్: తపాలా శాఖలో అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ 2.0 నూతన సాంకేతికత ఆధునీకరణ దిశగా మార్పులు తీసుకొస్తున్నారని ఆదిలాబాద్ ఇన్‌స్పెక్టర్ నాగిరెడ్డి రాజు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోస్టల్ రంగంలో సురక్షితమైన సేవల కోసం ఆధునాతన సాంకేతిక విధానం అమలుకు రంగం సిద్ధం చేశారని అన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ 2.0 తో అనేక రకాల సేవలను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆదిలాబాద్ సబ్ డివిజన్‌లోని అన్ని తపాలా కార్యాలయంలో జూలై 22 నుంచి సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆయన వెంట సబ్ డివిజనల్ అధికారి రమేశ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

26న మెగా జాబ్‌మేళా

ఇచ్చోడ: ఈనెల 26న మండల కేంద్రంలోని రాయల్ ప్యాలెస్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇచ్చోడ మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి శుక్రవారం తెలిపారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాకు 60కి పైగా ప్రముఖ కంపెనీలు రానున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిప్లామా, ఐటీఐ, ఎంబీఏ, ఎంకాం, ఎంసీఏ, చదువుకున్న యువత హాజరు కావాలని కోరారు. వివరాలకు 81069 87405 సంప్రదించాలన్నారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని పలు బాధిత కుటుంబాలను కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పరామర్శించారు. శుక్రవారం మండలంలోని కుంటాల(కె) మాజీ సర్పంచ్ అశోక్ తల్లి, వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఆడే గులాబ్‌సింగ్ తండ్రి మృతి చెందగా వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రకృతి ప్రేమికుడు సదానందం

- మొక్కలు పెంచడమే లక్ష్యం
- ఆదర్శంగా నిలుస్తున్న వైనం



తను పెంచిన మొక్కలతో సదానందం



ఏపుగా ఎదిగిన మొక్కలు

సిరికొండ: పేరులోనే ఉంది సదానందం అని పేరుకు తగ్గట్టు మొక్కలు పెంచి, ఆనందం వెతుక్కుంటున్నాడు. చుట్టూ పక్కల వారికి కూడా తను పెంచిన పచ్చదనం ద్వారా వచ్చే ఆక్సిజన్‌ను పంచుతున్నాడు ప్రకృతి ప్రేమికుడు సదానందం.

మొక్కల పెంపకమే వ్యాపకం..

మండలంలోని పొన్న గ్రామానికి చెందిన సదానందం అర్అండ్‌బీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేసి గత 2010లో ఉద్యోగ విరమణ చేశాడు. తన సొంత గ్రామమైన పొన్న గ్రామానికి వచ్చి గ్రామ సమీపంలో ఉన్న తన అర ఎకరం భూమిలో తనకు ఇష్టమైన మొక్కల పెంచి, ఒక గార్డెన్‌ను సృష్టించాడు. తనతో పాటు చుట్టూ పక్కల వారితో పాటు గ్రామానికి కూడా మొక్కలు అందజేస్తున్నాడు.

250 మొక్కల పెంపకం..

కుర్మ సదానందం ఉద్యోగం నుంచి రిటైర్డ్ అయ్యాక మొక్కల పెంపకం ప్రారంభించాడు. తనకున్న ఖాళీ స్థలంలో బోరు వేయించి సుమారుగా 250 రకాల వివిధ జాతుల మొక్కలను హైదారాబాద్, ఆదిలాబాద్ నుంచి తీసుకువచ్చి పెంచుతున్నాడు. ఆయన పెంచుతున్న మొక్కల్లో 5 రకల మామిడి, జామ, వాటర్ ఆపిల్, బత్తాయి, నిమ్మ, లక్ష్మణా ఫలం, సంపంగి, పొన్న, చెర్రి, సీతాఫలం, రామ ఫలం, సపోటా, అరటి వంటి పండ్ల మొక్కలతో పాటు పూల మొక్కలు జాజిమల్లే, గులాబీ, మందారం, సన్నజాజి, నందివర్ధనం, పారిజాతం, తీగ జాతి మొక్కలు తమలపాకు, బిర్యానీ ఆకు, రాఖీ మొక్క, మసాల ఆకు మొక్కలతో పాటు అనేక వివిధ రకాల మొక్కలు పెంచుతున్నాడు. 73 ఏళ్ల వయసులో మొక్కలు పెంచుతూ.. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

మొక్కలే జీవనాధారం

మనకు స్వచ్ఛమైన ఆక్సిజన్ తప్పనిసరి. కానీ మనం చేస్తున్న కాలుష్యం ద్వారా గాలి కూడా కలుష్యమై మనం బతికేందుకు ఆక్సిజన్ కూడా కొనే స్థితికి వచ్చాం. కావున తమ చుట్టూ ఉన్న పరిసరాల్లో మొక్కల పెంపంకం ఎంతో అవసరం. మొక్కలే మనిషికి జీవనాధారం. అందుకే ప్రతిఒక్కరూ మొక్కల పెంపకం చేపట్టాలి.

– కుర్మ సదానందం, ప్రకృతి ప్రేమికుడు

పాఠశాలలో బోనాల పండుగ



వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



బోనాల పండుగలో పాల్గొన్న ఎంఈవో

నేరడిగొండ: మండలంలోని రోల్‌మామడ ఎంపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణ రంగురంగుల బెలూన్లతో కళకళ లాడింది. విభిన్న వేషధారణలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచడంతో పాటు మన సంస్కృతి, చరిత్రపై అవగాహన కలిగిస్తాయన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకాధికారి వలిత, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అందరిని చల్లగా చూడాలని, పూజలు చేశారు. కార్యక్రమానికి ఎంఈవో మహమూద్ హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

విద్యారంగ సంక్షేమమే ధ్యేయం



సభ్యత్వ నమోదు చేస్తున్న బాధ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్టీయూ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రవీంద్ర అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నం.2లో సభ్యత్వ నమోదు చేపట్టారు. పీఆర్సీ, పెండింగ్‌లోని డీఏ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఏకీకృత సర్వీస్ రూల్స్ నిబంధనలను రూపొందించి ఖాళీగా ఉన్న ఎంఈఓ, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. నాయకులు బత్తూరి సత్యనారాయణ, చంద్రశేఖర్, పోచ్చరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి



డ్రై డేలో పాల్గొన్న అధికారులు

నార్నూర్: వర్షాకాలం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌సీ వైద్యాధికారి జితేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఈఎంఆర్ఎస్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్షాకాలం మలేరియా, డెంగ్యూ, అతిసార వ్యాధులు అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లి నేరుగా ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు, హెచ్ఈ తులసీదాస్ రాథోడ్, చరణ్‌దాస్ చౌహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

జైనథ్ : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు నైనాత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో గ్రామస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలం కావున గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్‌కుమార్, వైద్య సిబ్బంది సీహెచ్‌వో అంజయ్య, వేణుగోపాల్, వసంత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

భీంపూర్: వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేకాధికారి కిషన్ అన్నారు. శుక్రవారం మండలంలోని అందర్‌బంద్ బాలుర ఆశ్రమ పాఠశాల, కరంజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా రెసిడెన్షియల్ కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్య పాఠశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, జ్ఞానేశ్వర్, రోహిదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమానికి హాజరయ్యారు. మండల కేంద్రంలోని మిలింద్‌నగర్, ఎస్టీ కాలనీలో పర్యటించారు. ఎక్కువ రోజులు నిల్వ ఉన్న నీటిని పారబోశారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో జీవన్‌రెడ్డి, ఈవో సంజీవ్‌రావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులు రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణ కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులపై పశువులు తిరగడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఉట్నూర్ ఏఎస్పీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉట్నూరు పట్టణ కేంద్రంలో పాత బస్టాండ్, అంబేడ్కర్ చౌక్, పాత ఉట్నూరు, కొత్త బస్టాండ్ పలు ప్రాంతాలలో విచ్చలవిడిగా పశువులు రోడ్లపై తిరుగుతున్నాయన్నారు. ఈ విషయాన్ని చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా.. ఎలాంటి స్పందన లేదన్నారు. తక్షణమే చర్యలు తీసుకొని ఈ ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు.

ప్రశ్నించిన ప్రయాణికుడిపై డీఎం ఆగ్రహం

- వివాదాస్పదమవుతున్న డీఎం వ్యాఖ్యలు

ఆదిలాబాద్: ఆర్టీసీలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన అధికారులు ప్రయాణికులతో దురుసుగా మాట్లాడడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ప్రయాణికుడితో మాట్లాడిన తీరు సబబుగా లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి..

సంభాషణ జరిగిందిలా..

ఇచ్చోడ మండల కేంద్రం నుంచి ఖమర్ అనే యువకుడు డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి కాల్ చేసి మండల కేంద్రం లోపలికి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని డీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిగా డీఎం సమాధానం ఇస్తూ.. ట్రాఫిక్ సమస్య కారణంగా బస్సులను లోపలి వైపుకు నడపలేకపోతున్నామని సమాధానమిచ్చారు. ప్రయాణికుల ఇబ్బందులను పరిగణలోనికి తీసుకోరా అని సదరు ప్రయాణికుడు ప్రశ్నించగా, పోలీస్ శాఖ వాళ్లకి మీరే చెప్పి ట్రాఫిక్ క్లియర్ చేయించాలన్నారు. డీఎం సమాధానమివ్వడం పట్ల సదరు ప్రయాణికుడు అసంతృప్తి వ్యక్తం చేశాడు.

కోర్టుకు హాజరైన నాయకులు

బోథ్: 2022లో బీఆర్ అంబేద్కర్‌పై హమారాప్రసాద్ అనే వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనకు నిరసనగా నేరడిగొండ మండలంలోని 44వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అప్పట్లో ఎమ్మార్పీఎస్ నాయకులపై కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా వారు శుక్రవారం బోథ్ జూనియర్ సివిల్ కోర్టుకు హాజరయ్యారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న డీపీవో రమేశ్

ఇంద్రవెల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, గడువులోపు పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జి. రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ అమరవీరుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, పిట్టబొంగరం, దస్నాపూర్ గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులకు విడతల వారీగా ఖాతాలో నిధులు జమ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం డొంగర్‌గావ్ గ్రామంలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది గ్రామాలను సందర్శించి సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు విజయ్‌కుమార్, కారోబారి ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి



బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో మహారాష్ట్ర బ్యాంక్ ఉద్యోగి స్వామి విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యలో సాంకేతికత వినియోగించాలి



ఫిజిక్స్ క్లాసులు పరిశీలిస్తున్న జాదవ్ గణేష్

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి జాదవ్ గణేష్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. 'ఫి/ క్స్ వాలా' తరగతులు అందుబాటులో ఉండేలా అధ్యాపకులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యలో సాంకేతికతను వినియోగించాలన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఆధునిక మాధ్యమాలను ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాలలో అడ్మిషన్లు పెంచే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జయరాజ్, లక్ష్మణ్, వనజ, అనిల్, ఉదయ్ రెడ్డి, రవి, నాందేవ్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

జైనథ్: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి గారి ప్రీతంని ఆదిలాబాద్ కాంగ్రెస్ యువజన నాయకులు శుక్రవారం తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాజీవ్ యువ వికాసం యూనిట్‌లను ఆదిలాబాద్‌కు అదనంగా కేటాయించాలని కోరారు. బిక్కి గంగాధర్, దర్శనాల అశో క్, బిక్కి పోచ్చన్న, బిక్కి గంగన్న, అశోక్ పాల్గొన్నారు.

'అండర్' అవస్థలు



నేరడిగొండ: అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షపు నీరు

సాత్నాల/నేరడిగొండ: నేరడిగొండ మండలంలోని అండర్ బ్రిడ్జి వద్ద వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలాగే భోరజ్ మండలం సిర్సన వెళ్లే మార్గంలో అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచి ఉండడంతో రాకపోకలు స్తంభించిపోతున్నాయి. నీటిలో జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలకు కోరుతున్నారు.



సాత్నాల: ఇబ్బంది పడుతున్న వాహనదారుడు

కేజీబీవీ తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారి

బేల: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని శుక్రవారం మండల ప్రత్యేకాధికారి మనోహర్‌రావు తనిఖీ చేశారు. తరగతులను, వంటగదిలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, కేజీబీవీ చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌కు సూచించారు. కేజీబీవీ అధికారి గేడం నవీన, ఎంపీడీవో మహేందర్‌కుమార్, తదితరులు ఉన్నారు.

హాస్టల్‌లో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు నవీన్‌రెడ్డి

బోథ్: మండలంలోని పట్నాపూర్‌లోని గిరిజన ఆశ్రమ బాలుర హాస్టల్‌లో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. సొనాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నవీన్ రెడ్డి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అలాగే సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ ప్రియాంక, ఏఎస్ఎం స్వప్న, హెల్త్ అసిస్టెంట్ గోవింద్, ఆశ కార్యకర్త యశోద పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని క్రీడల్లో సత్తాచాటి క్రీడా పాఠశాలలో సీటు సాధించింది. మండల కేంద్రంలోని ఎంపీయూపీఎస్ పాఠశాల 4వ తరగతి విద్యార్థిని సూర శ్రావణి ఇటీవల విడుదల ఫలితాల్లో సీటు సాధించడంతో ఉపాధ్యాయులు శుక్రవారం ఆమెను అభినందించారు.

రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: బేల మండలంలోని భవానిగూడ గ్రామానికి చెందిన టేకం సంతోష్ కిడ్నీ సమస్యతో బాధపడుతూ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుడికి రక్తం అత్యవసరం కాగా, యువజన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డిని సంప్రదించగా ఆయన స్పందించి రక్తదానం చేశారు.

సింగిల్ టీచర్ పాఠశాలలకు ప్రాధ్యానత ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇచ్చోడ: ఉపాధ్యాయ సర్దుబాటులో సింగిల్ టీచర్ పాఠశాల ఉపాధ్యాయులకు ప్రాధాన్యత ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవో బిక్కుకు అందచేశారు. సర్వే విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సీసీఐ సంబధించిన ప్రొసీడింగ్ అందచేయాలని కోరారు. ఉపాధ్యాయుల సర్దుబాటు మండలంలో పూర్తయిన తర్వాతనే పక్క మండలానికి సర్దుబాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ మండల అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.